క్లుప్తంగా

బియ్యం, కూరగాయల వితరణ

కడియం: గుంటూరులో ఈనెల 26, 27, 28, 29 తేదీల్లో జరిగే బైబిలు మిషన్ మహాసభలకు హాజరయ్యే భక్తులకు భోజన సదుపాయం కల్పించే నిమిత్తం బియ్యం, కూరగాయలు తదితర వాటిని మంగళవారం పంపించారు. ఈ మేరకు మండలంలోని దామిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవరపల్లి రత్న రాజు, సాకా ఏసుపాదం, కప్పల ఏసురత్నం, వి.శ్యామ్, సామ్యేల్ తదితరులు భక్తుల నుంచి సేకరించిన వీటిని వాహనంపై అక్కడికి తరలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

26న షాపులకు సెలవు

రాజమహేంద్రవరం సిటీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలో షాపులు సెలవు పాటించాలని కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షాప్స్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్ట ప్రకారం సెలవు దినం కావున వర్తక సోదరులందరూ తమ షాపులను మూసివేయాలన్నారు.

వైభవంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ధవళేశ్వరం: గ్రామంలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి కన్నుల పండవగా జరిగింది. ఉదయం ధ్వజారోహణ, మండపారాధన, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ నెల 29వ తేదీ వరకూ కల్యాణోత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు పాల్గొన్నారు.

సాయం అందజేత

కడియం: వేమగిరి రాజీవ్‌నగర్ కాలనీలో అగ్ని ప్రమాద బాధితులకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, టీడీపీ నాయకులతో కలిసి రూ.37 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, చెల్లుబోయిన శ్రీనివాస్, గుత్తుల కృష్ణ, జోగి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: విజయ్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ మినీ సబ్ జూనియర్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2023 పోస్టర్‌ను మంగళవారం స్థానిక లాలాచెరువులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అనుశ్రీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29న అండర్ 9, 11, 13, 15 విభాగాలకు సంబంధించి బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులకు, వారి తల్లిదండ్రులకు, కోచ్‌లకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైవీడీ ప్రసాద్, గెడ్డం నాగరాజు, గుత్తుల సత్యనారాయణ, విన్నా వాసు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టబోయే యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాల మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ మంగళవారం బొమ్మూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భీమరశెట్టి రమేష్, పిల్లా తనూజ, పలివెల సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగ్గురు యువకుల అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: యానాంలో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా తీసుకువచ్చిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శాటిలైట్‌సిటీకి చెందిన ముగ్గురు యువకులు యానాం నుంచి రెండు వాడ్కా ఫుల్, 13 వివిధ రకాల టిన్‌బీర్లు తీసుకువచ్చారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో శాటిలైట్‌సిటీలోని ఖాళీ ప్రదేశంలో పుట్టినరోజు పార్టీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ సమయంలో బొమ్మూరు ఎస్సై శివాజీ, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఆ ముగ్గురు యువకులను అరెస్టు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీకి ప్రజాదరణ

సీటీఆర్ఐ: టీడీపీకి ప్రజాదరణ పెరుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 42వ డివిజన్ మున్సిపల్ కాలనీ పార్కులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

స్వామికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భారీగా అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 58 మంది భక్తులు అభిషేకాలు చేసుకున్నారు.

బొమ్మను చేసి .. ప్రాణం పోసి..

- జీవం ఉట్టిపడుతున్న బొమ్మలు
- నైపుణ్యం చాటుతున్న రాజస్థానీలు



విక్రయాల కోసం సిద్ధం చేసిన బొమ్మలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యాభ్యాసానికి వారు దూరం.. పుట్టింది మొదలు సంచార జీవితమే.. ఎక్కడుంటే అదే వారి ప్రాంతం.. అక్కడే పొట్టకూటి కోసం బొమ్మల తయారీ.. కళాపోషకులు ఆదరిస్తే బతుకు.. లేదంటే పస్తు.. ఇదీ వలస వచ్చిన రాజస్థానీయుల జీవనం. దేవుడి చేతిలో ప్రాణులు జీవం పోసుకుంటే ఈ రాజస్థానీల చేతిలో బొమ్మలు పురుడు పోసుకుంటున్నాయి. పుట్టపర్తి కేంద్రంగా కొంతకాలంగా రాజస్థానీయులు తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని బొమ్మల తయారీతో జీవనం సాగిస్తున్నారు.

జోధ్‌పూర్ నుంచి రాక..

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన పలువురు మూడు నెలల క్రితం రాజమహేంద్రవరం చేరుకున్నారు. పట్టణ శివారులో తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గృహాలంకరణ బొమ్మల తయారీ చేపట్టారు. వీరిలో ఏ ఒక్కరికీ అక్షరం ముక్కరాదు. తెలుగు అర్థం చేసుకుంటారు కానీ మాట్లాడడం రాదు. కేవలం రాజస్థానీ, హిందీ తప్ప మరో భాష రాదు. అయినా చేతిలో పని ఉంటే చాలు గౌరవంగా బతికేందుకు భాష అడ్డం రాదని నిరూపిస్తున్నారు. దాదాపు 50 రకాల బొమ్మలను జీవం ఉట్టిపడేలా తయారు చేస్తున్నారు. బొమ్మ పరిమాణాన్ని బట్టి రూ.100 నుంచి రూ.500 వరకూ విక్రయిస్తున్నారు.

ఆదరణ మరువలేం

తమ ప్రాంతానికి చెందిన అనేక కుటుంబాలు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో బతుకుతున్నాయని ఏకారామ్, దేవా తెలిపారు. పదేళ్లుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. చాలా పట్టణాలు, నగరాలు చుట్టేసి వచ్చినట్లు వివరించారు. ఎక్కడికి వెళ్లినా శివారు ప్రాంతంలోని విశాలమైన మైదాన ప్రాంతాన్ని అద్దెకు తీసుకుని గుడారం ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఏపీలోనే తమకు మంచి ఆదరణ ఉంటోందని, దీంతో నెలల తరబడి ఈ ప్రాంతాల్లోనే జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తయారైన విగ్రహాలను రోడ్డు పక్కన ప్రదర్శనకు ఉంచడం, మరికొన్నింటిని రిక్షాలలో వేసుకుని కాలనీల్లో తిరుగుతూ విక్రయిస్తున్నామన్నారు. పెట్టుబడులు పోను రోజుకు రూ.రూ.వెయ్యి నుంచి రూ.1500 మిగులుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ప్రభుత్వ స్థలాల్లో గుడారాలు వేసుకుని బొమ్మలు చేసుకునే అవకాశం కల్పిస్తే అద్దెభారం తగ్గుతుందని తెలిపారు.



సహజత్వం ఉట్టిపడుతున్న విగ్రహాలు



బొమ్మలకు రంగులు వేస్తున్న రాజస్థానీ మహిళ

విద్యార్థినులకు క్విజ్ పోటీలు



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న లక్ష్మీశ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరి

రాజమహేంద్రవరం రూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి అధ్యక్షురాలు లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం బొమ్మూరులోని జీపీఆర్ హైస్కూల్లో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు లక్ష్మీశ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఈశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాటలు పాడిన విద్యార్థినులకు ప్రోత్సాహకంగా నగదు అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇన్నర్‌క్లబ్ సభ్యురాలు సౌందర్య, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ముద్దాల అను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ భరత్ రామ్

- ఎంపీ భరత్ రామ్
- లలితా నగర్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: డివిజన్లలో పారిశుద్ధ్యం తదితర సమస్యలను తెలియజేస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. 37వ డివిజన్ ఇన్‌చార్జి సబ్బారపు సూరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక లలితా నగర్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లంక లక్ష్మి అనే వృద్ధురాలు తనకు పింఛన్ మంజూరు చేయించాలని కోరింది. ఆధార్ కార్డులో వయసు తక్కువగా ఉండడంతో పింఛన్ రాలేదని తెలిపింది. ఎంపీ వెంటనే ఆమెకు పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోమని వలంటీర్‌కు ఆదేశించారు. అప్పటి వరకూ ప్రతినెలా రూ.వెయ్యి పెన్షన్ అందేలా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లో పారిశుద్ధ్యం, రహదారులు శుభ్రంగా ఉన్నాయని స్థానికులు తెలియజేయడంతో భరత్ రామ్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పార్టీ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, పాలిక శ్రీను, సప్పా ఆదినారాయణ, నగర పాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు పాల్గొన్నారు.

జగన్ పాలన.. సంక్షేమానికి చిరునామా

- ఎంపీ భరత్ రామ్
- 10వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమానికి చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిలుస్తోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. 10వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో మంగళవారం వీఎల్ పురం వినాయకుడి గుడి నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని ధ్వజమెత్తారు. జగనన్న పేదల సంక్షేమమే ముఖ్యమని భావించి నవరత్నాలతో పాటు పలు వివిధ పథకాలు అమలు చేశారన్నారు. పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న జగన్‌కు మద్దతు, ఆశీస్సులు అందజేయాలని కోరారు. రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనించాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, స్టేట్ బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, నగర బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఆరే చిన్ని, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

60 శాతం ఈ క్రాప్ నమోదు



దోమాడలో ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: రైతులు సాగు చేస్తున్న పంటకు సంబంధించి ఈ క్రాప్ నమోదు ప్రక్రియ మండలంలో 60 శాతం పూర్తయిందని మండల వ్యవసాయశాఖాధికారి టీ.వీ.ఆర్.మణిదీప్ అన్నారు. దోమాడలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18,000 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సుమారు 10,875 ఎకరాల్లో పూర్తయిందన్నారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకుల సమక్షంలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. పంట నమోదు సమయంలో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్, రైతు వేసిన పంట రకం, కౌలుదారు కార్డు నకలు సమర్పించాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేయడంతో పంట నష్టం వచ్చినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ప్రధాన మంత్రి పసల్‌బీమా యోజన, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ప్రకాశం నగర్: జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను మంగళవారం నగరంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమం జరిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు టి.ఆదిలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బాలికను రక్షిద్దాం... బాలికను చదివిద్దాం అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ పి.సూర్య ప్రభావతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, అర్బన్ సీడీపీఓ వి.నరసమ్మ పాల్గొన్నారు.

కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో..

కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణ, ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. ఆంగ్ల అధ్యాపకులు ఎస్.దుర్గాప్రసాద్, చిన్నిబాబు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో..

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం జాంపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్లో విద్యార్థినులకు గోదావరి పరిరక్షణ సమితి సభ్యుడు టీకే విశ్వేశ్వరరెడ్డి నోట్ పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. రాజమహేంద్రి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సత్య సౌందర్య, వార్డెన్ ప్రభావతి పాల్గొన్నారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



బ్యాటింగ్ చేస్తున్న రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్

అనపర్తి: స్థానిక జీబీఆర్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ప్రభుత్వోద్యోగుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం రెండో రోజు జరిగిన పోటీల్లో డీఎంహెచ్ఓ–రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్(ఆర్ఎంసీ) జట్లు తొలి మ్యాచ్‌లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్ఎంసీ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 166 పరుగులు చేయగా డీఎంహెచ్ఓ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 60 పరుగులు మాత్రమే సాధించింది. ఆర్ఎంసీ జట్టులో బ్యాటింగ్ చేసిన రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ 58 పరుగులు చేసినట్లు పీడీ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం జీఎస్‌డబ్ల్యూఎస్–ఆర్ఎంసీ జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఆర్ఎంసీ జట్టు విజయం సాధించింది. రెవెన్యూ–ఎక్సైజ్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్స్‌లో రెవెన్యూ జట్టు 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 138 పరుగులు సాధించగా ఎక్సైజ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 95 పరుగులు సాధించింది. రెవెన్యూ జట్టులో కొవ్వూరు డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు 72 పరుగులు సాధించారు. బుధవారం ఆర్ఎంసీ–ఫైర్ శాఖల మధ్య సెమీఫైనల్ అనంతరం ఫైనల్స్ జరగనున్నాయి.

నిత్యావసరాల వితరణ



వెలుగుబందలో సాయం అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: నియోజకవర్గంలోని వెలుగుబంద, దివాన్ చెరువు, శ్రీరామపురం, రూపానగర్, నిడిగట్ల, పాలచర్ల మున్నగు గ్రామాలలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు చేయూత నందించారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ సంజీవని పథకంలో 26 కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం, నిత్యవసర వస్తువులను అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను చూపిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు

మధురపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్న లక్ష్యంతో మంగళవారం విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి జెడ్పీ హైస్కూల్లోని 106 మంది విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిచ్చారన్నారు. నాడు – నేడు పథకం ద్వారా స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ఇది సహించలేని ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ శీలం నాగ త్రినాథరావు, దోసకాయలపల్లి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసు, గాదరాడ హెచ్‌ఎం గణపతి, శ్రీరంగపట్నం హెచ్‌ఎం నరసింహరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వనుం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బయటపడిన పురాతన విగ్రహం



పురాతన కాళీమాత విగ్రహం

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నం–శ్రీరామపురం రోడ్డును ఆనుకుని ఉన్న ఒక తోటలో పురాతన కాళీమాత విగ్రహం బయటపడింది. కొట్టి వెంకట్రావు అనే కౌలు రైతు సాగులో భాగంగా తోటలో వాటర్ పైపులైన్ వేసేందుకు కూలీలను పెట్టి తవ్విస్తుండగా అడుగున్నర గుండ్రటి రాతిపై చెక్కిన కాళీమాత రూపంతో ఉన్న విగ్రహం కనిపించింది. వెంటనే ఆ విగ్రహాన్ని బయటకు తీసి, చెట్టు కింద పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న భక్తులు అక్కడకు తరలివచ్చి పూజలు చేయడం ప్రారంభించారు.

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి

- డీఈఓ అబ్రహాం
- పుణ్యక్షేత్రం, సంపత్‌నగరంలో స్కూళ్ల సందర్శన



సంపత్ నగరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ అబ్రహాం

రాజానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా రాసి, మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణులయ్యేందుకు సరైన ప్రణాళికతో పఠనం చేయాలని విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సూచించారు. మండలంలోని పుణ్యక్షేత్రం, సంపత్ నగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాల్లోని రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును నిశితంగా పరిశీలించారు. నాడు – నేడు పనుల ప్రగతిని ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు చేయాల్సిన కృషిపై అవగాహన కలిగించారు. పరీక్షలంటే ఉన్న భయాన్ని తొలగించుకోవాలన్నారు. ఇటీవల జరిగిన సమ్మెటివ్ 1 జవాబు, ప్రశ్న పత్రాలను పరిశీలించి కొన్ని సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయులు జ్యోతిప్రసాద్, సూర్య సుందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడిలో కల్వర్టు నిర్మాణం

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద గల జగనన్న కాలనీకి వెళ్లే దారిలో ఉన్న కాలువ పై గ్రామ సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మించారు. కాలువపై కల్వర్టు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండటంతో గ్రామ పంచాయతీ నిధులు లక్ష రూపాయలతో కల్వర్టు నిర్మాణం చేపట్టినట్టు సర్పంచ్ మాధవి తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ బాలికా దినోత్సవం ప్రాముఖ్యతను హెచ్‌ఎం బీవీఎల్ఎస్ మూర్తి విద్యార్థులకు వివరించారు. బాలికలు తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలిపారు.

కాపులను బీసీల్లో చేర్చాలి

సీతానగరం: కాపులను బీసీల్లోకి చేర్చాలని, ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఇనుగంటివారి పేటలో మండల కాపు సంఘం అధ్యక్షుడు సత్యం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కాపు సంఘం సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు మంగారావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జల్లె జోగిరాజు (నాని) పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	వారసుడు
సూర్యమినీ	కళ్యాణం కమనీయం
సూర్యప్యాలెస్	వీరసింహారెడ్డి
స్వామి	వాల్తేరు వీరయ్య
శివజ్యోతి	వాల్తేరు వీరయ్య
అనుశ్రీ	వాల్తేరు వీరయ్య
రాజా	వాల్తేరు వీరయ్య
కుమారి	ధమాకా
ఊర్వశి	మసూదా
రంభ	లవ్ టుడే
మేనక	తెగింపు
గీతాఅప్సర	వాల్తేరు వీరయ్య
నామవరం	
వీఎస్ మహల్	వాల్తేరు వీరయ్య
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	వాల్తేరు వీరయ్య
కడియం	
వెంకటసూర్య	వాల్తేరు వీరయ్య

రహదారుల భద్రతపై అవగాహన



పెదపూడిలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వాసు

పెదపూడి: రహదారుల్లో ప్రయాణించే వాహన చోదకులు తీసుకోవాల్సిన రవాణా భద్రత చర్యలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై పి.వాసు తెలిపారు. పెదపూడిలోని పోలీస్ స్టేషన్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత, రవాణాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రవాణా సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. సైబర్, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. కఠినమైన చట్టాలు అమలులో ఉన్న నేపథ్యంలో అందరు కచ్చితంగా రహదారి భద్రత నిబంధనలు పాటించాలన్నారు.

రైతు భరోసా కేంద్రంలో విజిలెన్స్ తనిఖీలు

గోకవరం: కృష్ణునిపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రాజమహేంద్రవరం యూనిట్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలో ఉన్న కియోస్క్ మెషీన్ పనితీరు, ఈ క్రాప్ నమోదు, రైతులకు అమలవుతున్న పథ కాల తీరు, రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా అమలు తీరును పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.